




**-12-**

## తెలుగు లాక్షణికుడు కాకునూరి అప్పకవి

లక్షణ గ్రంథాలలో అప్పకవీయం చాలా ప్రఖ్యాతమైన గ్రంథం. ఆంధ్ర సాహిత్యములో ఇది పరమ ప్రమాణికమైన గ్రంథంగా పెద్దలందరూ అంగీకరించారు. ఇది రచించిన వారు కాకునూరి అప్పకవి. ఈయన గ్రంథము చందోగ్రంథంగా చలామణి అవుతోంది. తెలుగు పండితులకు భయమన్నది లేదు, కాని అప్పకవి పేరు చెబితే మాత్రము ఉలికిపడతారు. ఎందుకంటే అప్పకవి చెప్పిన చందోలక్షణాలకు లొంగని పూర్వకవుల ప్రయోగాలను దిద్దే ప్రయత్నం జరిగింది కాబట్టి.

అప్పకవి ఇంటిపేరు కాకునూరి. ఈ కాకునూరి అగ్రహారము నేటి మహాబూబ్‌నగరు జిల్లాలోని లేమామిళ్ళ గ్రామము. అప్పకవి వంశమంతయూ కవులు, పండితులు. అప్పకవి తాత సోమయ్యగారు తపస్సు చేసి తమ ఇంట ఎల్లప్పుడూ సరస్వతీ నిలయమవ్వాలని కోరుకున్నారట. వారింట అందుకే ఏ కార్యమైనా ముందు వాణిని పూజించేవారని అప్పకవి తన కావ్య పీఠికలో వివరించాడు . అప్పకవి తాత పెదసోమయ్య పండితుడే కాక శ్రీమంతుడు. 'మారటబ్రహ్మ' యని లోకులతనికి దండం పెట్టేవారుట.

అప్పకవి ప్రస్తుత పాలమూరు జిల్లా, కేశంపేట మండలంలోని కాకునూరు గ్రామంలో జన్మించారు. ఈయన విద్యాభ్యాసం తన మేనమామల వద్ద పల్నాటి సీమలో గడిచింది. అప్పకవి అనేక విషయాలను వివిధ గురువుల దగ్గర నేర్చుకున్నారు. మూర్తి సర్వన్న గారి దగ్గర యజుర్వేదం, కాందురి గిరయ్య గారి దగ్గర వ్యాకరణం, సూరభట్టు గారి దగ్గర సకల సిద్ధాంతాలు, కొలిచెలమల్ల సింగన్న గారి దగ్గర స్మార్త కర్మలు, రాజయోగి గారి దగ్గర ఆగమాలు, మంచికంటి ఓబన్న గారి దగ్గర లక్షణ గ్రంథాలు నేర్చుకున్నాడు.

విద్యాభ్యాసం పూర్తయ్యాక అప్పకవి శ్రీశైలం వెళ్ళాడు. అప్పటి ఆ ప్రాంత అధికారి అయిన భోగి విభూషణుడి ఆస్థాన కవిగా కొంతకాలం పనిచేశాడు. అక్కడే స్మార్తకర్మలకు సంబంధించి 'అపస్తంబ షట్కర్మ నిబంధనం' అను సంస్కృత నిబంధన గ్రంథాన్ని రచించాడు. 'కాలబాలార్ణవ సంహిత' అనే జ్యోతిషగ్రంథానికి శ్లోకరూప సంగ్రహాన్ని రాశాడు. స్త్రీలకు పనికి వచ్చే 'సాధ్వీజన ధర్మం' అనే ద్విపద కావ్యాన్ని, 'అనంతవ్రత కల్పం' అను కావ్యాన్ని రచించాడు. శ్రీశైల మల్లికార్జుని మీద శ్లేష గర్భితమైన నిందా స్తుతి శతకాన్ని రాశాడు. 'అంబికావాదం ' అను యక్షగానాన్ని, రచించాడు. ఆనాడు ఉద్దండపండితులు యక్షగానాలు రచించేవారు. మంచికంటి ఓబన్నగారి ప్రోద్బలముతో 'కవికల్పం' అను లక్షణ గ్రంథాన్ని రచించాడు. ఇవ్వన్నీ 1656 కు పూర్వము రచించాడు.

1656 కృష్ణాష్టమి నాడు గోపాలస్వామి గుడిలో పూజలు చేసుకొని ఆ రాత్రి పురాణశ్రవణము వింటూ ఉండగా నిద్రపట్టి, కల వచ్చింది. కలలో రెండు చేతులు, అటు ఇటు ఇద్దరు దేవేరులు ఉన్న పరమాత్మ దర్శనమిచ్చాడు. అప్పకవి చెయ్యవలసిన పని గురించి చెప్పాడు.

'నన్నయభట్టి' యన్న కావ్యముంది. దానిని తెలుగు చెయ్యమని దేవుడు చెప్పాడు. ఇది ఎవ్వరూ కనీ విని ఉండరు. అప్పకవి అదే చెప్పాడు దేవునితో. నన్నయ్య మొదట ఆంధ్రశబ్దచింతామణి యన్న వ్యాకరణ గ్రంధాన్ని రచించాడు. దానిని ఆధారముగా చేసుకొని మహాభారతము తెలుగీకరించ పూనుకున్నాడు. కానీ నన్నయ్య మీద ఉన్న కోపముతో భీమకవి ఆ కావ్యాన్ని గోదావరి పాలు చేశాడు. ఆ కావ్యము అలా నష్టమైనది. కాని, అంతకు పూర్వమే ఆ కావ్యమును సారంగధరునికి నేర్పి ఉన్నందున సారంగధరుని గళములో మిగిలినది. ఆ తరువాత దానిని సారంగధరుడు ఎలకూచి బాలసరస్వతిగారికి ధారాదత్తం చేశాడు. ఆ కావ్యములో ఎనబది రెండు ఆర్యలున్నాయి. అవి ఐదుపరిచ్ఛేదాల క్రింద విభజించారు. ఆ కావ్యము అప్పకవికి అందుతుందని, దానిని తెనుగీకరించమని చెప్పి దేవుడు మాయమయ్యాడు.

ఆ మరునాడు ఒక బ్రాహ్మడు కాశీకి వెడుతూ వీరింట ఆ రాత్రి గడుపుతూ మాటలలో 'విశ్వశ్రేయఃకావ్య'మన్న శ్లోకము చదివాడు. అది ఎక్కడిదో అప్పకవికి తెలియలేదు. వివరాలడిగితే 'నన్నయభట్టి' అప్పచెప్పినాడు.

అప్పకవి ఆ కావ్యము నకలు తీసుకొని, ఆయనను కాశీకి సాగనంపాడు. వెను వెంటనే తెనుగీకరించే కార్యము మొదలుపెట్టాడు. అప్పటికే అప్పకవి 42 లక్షణ గ్రంథాలను పరిశీలించి యున్నాడు. 72 కావ్యాలను చదివాడు. విలక్షణమైన పద్యాలను, ప్రయోగాలను తెలుసుకొనే ఉన్నాడు. 'కవికల్పమనే' లక్షణ గ్రంథము రాసి కూడా ఉన్నాడు. ఆయనకు ఆంధ్రశబ్ధచింతామణి రాయటానికి అందుకే కష్టము కాలేదు.

కందుకూరి వారి ప్రకారము ఈ కల అంతయూ అప్పకవి పుట్టించిన పుకారు. బాలసరస్వతి కావ్యానికి పేరు తెప్పించటానికి అప్పకవి పన్నిన పన్నాగమని కందుకూరి వారి అభిప్రాయము(ఆంధ్రకవుల చరిత్ర పే.678)

ఈ గ్రంథము వ్రాయక పూర్వము తను ఏదో ఘనకావ్యము చెయ్యాలనుకున్నాడని అప్పకవి ఈ గ్రంథ పీఠికలో ఇలా చెబుతాడు

"క. అని యిష్ట దేవతాస్తుతి

యును సకల కవీంద్రులనుతియును గురునతియున్

వినయమున సలిపి తెలుఁగున

ఘనకావ్యం బొకటి సేయఁగాఁ దలఁచుతఱి ౯॥"

ఈ గ్రంథము మూలములో ఎనిమిది అశ్వాసాలు ఉన్నవి. అప్పకవి ఎన్ని అశ్వాసాలు రచించినాడో గాని మనకు మాత్రము ఐదు లభ్యమవుతున్నాయి. అవి భాషాపరిచ్ఛేదం, వర్ణపరిచ్ఛేదం, వళిప్రాసపరిచ్ఛేదం, పద్య పరిచ్ఛేదం, సంధిపరిచ్ఛేదం. మూలములో కేవలము 80 ఆర్యలుంటే అప్పకవి తెనుగీకరించినవి మనకు 50 మాత్రమే లభ్యము. ఆ 50 ఆర్యలను అప్పకవి 1602 పద్యాలలో వివరించాడు. ఇంత సవివరముగా రాసినదానిని అనువాదమనటము కన్నా స్వతంత్ర కావ్యమనవచ్చు. ఆయన ఎందుకు మిగిలినవి అనువదించలేదో, లేక నష్టమైనవో మనకు తెలియదు.

అప్పకవి ఐదు అశ్వాసాలు రాసిన తరువాత మరణించి ఉండవచ్చునని తన 'ఆంధ్ర కవుల చరిత్రము" లో కందుకూరి వారు అభిప్రాయపడ్డారు.

ఈ గ్రంథపు పీఠికలో ఈ గ్రంథము రచనకు పూర్వము తాను చదివిన 40 వరకు లక్షణ గ్రంథాల పేర్లను ఉటంకించినాడు అప్పకవి. ఆయన చెప్పిన ఆ లెక్కబట్టి మనకు సాహిత్యములో ఆనాడు లభ్యమవుతున్న గ్రంథాలు తెలిసినవి. ఆనాడు గ్రంథాలు లక్షోపలక్షలు ఉన్నవని చెబుతూ–

"ఒకదాని కంటె మరివే

రొకటి విశేషంబు జెప్పుచుండు కతమునన్

సకల గ్రంథములను జదు

వక తెలియునే లక్షణ ప్రపంచంబెల్లన్?"

తాను చదివినవన్నీ వెతికి సారమును బట్టి అప్పకవి తన లక్షణ గ్రంథము రాశాడు. అందుకే అప్పకవీయం చదివితే మరి వేరొకటి చదివే పనిలేదు.

ఈ గ్రంథములోని ప్రథమాశ్వాసము వివరించినవి: ప్రామాణిక గ్రంథాల జాబితా ఇచ్చాక లక్షణవేత్తలలో మూడు రకంవాళ్ళు ఉన్నారని చెప్పాడు. లక్ష్యలక్షణ పద్యాలు తెలిసిన వారు ఉత్తములు. లక్ష్యపద్యాలు తెలిసినవారు మధ్యములు. లక్ష పద్యాలు తెలిసినవారు అధములు.

"విశ్వశ్రేయః కావ్యం" అన్న తొలి సూత్రానికి 18 పద్యాల వివరణ చెప్పాడు. కావ్యబేధాలు, ఇరువైరెండు వర్ణనల జాబితా ఇచ్చాడు. శబ్దార్థలక్షణాలూ, అలంకారాలూ, అనుప్రాసలు, చిత్ర కవిత్వము, గర్భకవిత్వము, బంధ కవిత్వము గురించి చెప్పాడు. 16 శబ్దగత దోషాలు, 50 అర్థగతదోషాల గురించి వివరించాడు.

సుకవి మహాత్మ్యం, సత్కవిలక్షణం, కవుల తేడాలు, కవిప్రశంస, తెలుగు మాటలు, ప్రాకృతములో పుట్టిన మాటలు వివరించాడు. లక్ష్మికి లచ్చి తెలుగు రూపాంతరమ్మనట్లుగా ఇలా చెబుతాడు–

"నాకుల భాషను ముట్టక

ప్రాకృతమున లచ్చి దా బరగు లచ్చిమనన్।

నాకోక్తియైన లక్ష్మికి

బ్రాకటముగ లక్కిమి యని పలుకగ వలదే? "– (1–90)

తెలుగు పదాల యొక్క సంస్కృత మూలాలను వివరించాడు.

ద్వితీయాశ్వాసంలో వర్ణపరిచ్ఛేదం వివరించాడు అప్పకవి. ఇందు అక్షర ఉచ్చారణలు ఎలా ఉంటాయో వ్రాశాడు. వాటి స్వరూపాలు, లేఖకులు సామాన్యముగా చేసే తప్పులు వివరించాడు.

ఎక్కడ క్రారకొమ్ములు వాడాలో, ఎక్కడ వట్రసుడువ్రాయాలో, చెబుతూ తెలుగువారు 'గృహము' అని రాసి 'గ్రుహము' అని పలుకుతారని వివరించాడు. అలాగే అప్పకవి రెండు పెద్ద పట్టికలను తయారుచేశాడు. ఎక్కడ 'ర' వ్రాయాలో, ఎక్కడ బండిర(ఱ) వ్రాయాలో ఆ పట్టిక సూచిస్తుంది. ర,ఱ ల తేడాల తరువాత అక్షరబీజాలు, సారస్వత

ఔషదాలు చెప్పి ఏ అక్షరము ఎక్కడ వాడకూడదో చెప్పాడు. అప్పకవి ప్రకారము రూకెత్తు ఓషదము తింటే సూక్తులు ఘటిస్తాయి. ఉసిరికాయంత తింటే పద్యశతకము వల్లెవేస్తారు. చిన్నమొత్తు తింటే నాలుక మీద నల్లచెరువు కాపురముంటుందిట.

ఇక తృతీయాశ్వాసం. ఇందులో యతి ప్రాసల గురించి వివరించాడు. ఈ తృతియ అశ్వాసమే చాలా మంది నేటికీ బట్టీయము పడుతూ ఉంటారు, ముఖ్యంగా పద్య రచనలు చేసేవారు. పద్య రచనకు యతి ప్రాసలన్నివి తెలిసి ఉండాలి కాబట్టి.

"పూర్వకవుల లక్ష్యములు గూర్చి సత్కవి

జనములవునటంచు సమ్మతింప

విశ్రమంబులేను విరచింతు నాలుగు

పదులఁమీఁద నొకటి విదితముగ॥"

అప్పకవి ప్రకారము యతులు 41.

ఇవి నాలుగు రకాలుగా విభజించాడు. అవి స్వరయతులు, వ్యంజనాక్షరయతులు, ఉభయ యతులు, ప్రాసయతులు.

వీటిలో స్వర యతులు 7 రకాలు, వ్యంజనాక్షరయతులు 21, ఉభయ యతులలో 12 భేదాలు ఉన్నవి.

స్వర యతులు (స్వరమైత్రి వళి, స్వర ప్రధానయతి, లుప్తవిసర్గక స్వరవళి, ఋవళి, ఋత్వసంబంధవళి, ఋత్వసామ్యవళి, వృద్ధివళి)

వ్యంజనాక్షరయతులు 21. అవి ప్రాణయతి, వర్గజయతి, బిందుయతి, తద్భవ వ్యాజయతి, విశేషవళి, అనుస్వార సంబంధయతి, అనునాసికాక్షరయతి, మువిభక్తియతి, ముకారయతి, మవర్ణయతి, ఋజుయతి, ప్రత్యేకయతి, భిన్నయతి, ఏకతరయతి, అభేదయతి, అభేదవర్గయతి, ఊష్మయతి, సరసయతి, సంయుక్తయతి, అంత్యోష్మసంధియతి, వికల్పయతి.

ఉభయయతులు 12. అవి యష్మదస్మచ్ఛబ్దయతి (యష్మద్, అస్మద్ పై యతి), పరరూపయతి, ప్రాదియతి, నిత్యసమానయతి, దేశ్యనిత్య సమానయతి, నిత్యయతి, రాగమసంధి, విభాగవళి, నామాఖండయతి, పంచమీ విభక్తియతి, కాకుస్వరయతి, ప్లుతయుగయతి, ప్రాసయతి.

అప్పకవి అఖండయతిని ఒప్పుకోడు. ప్రాదియతి, నిత్య సమాన యతి మొదలైన ఉభయ యతులలో చేరని స్వరసంధి ఘటిత పదాలలో సంధ్యక్షరముకు హల్లుతో యతి మైత్రి చెయ్యటము అఖండయతి.

నిజానికి తెలుగు సాహిత్యములో అఖండ యతి వాడని కవి ఉండడు. కవిత్రయముల నుంచి తిరుపతి కవుల వరకూ వాడారు. అప్పకవి అఖండయతి ఒప్పుకు వుంటే , యతులు తగ్గెవి. అప్పకవి ప్రకారము కవిత్రయములు అఖండయతిని అంగీకరించలేదు కానీ లేఖకులు దిద్దినారని అభిప్రాయపడ్డాడు. ఈ అఖండయతి ప్రయోగము అర్వాచీన గ్రంధములలో చాలా చోట్ల కనపడుతుంది.

యతుల తరువాత ప్రాస గురించి చెప్పాడు అప్పకవి. ప్రాసలు 17 రకాలు. యతుల వలెనె పూర్వులు చెప్పిన వాటి కంటే ఎన్నో ప్రాసలను పెంచాడు అప్పకవి. ఆయన చెప్పిన ప్రాస భేదములు: అర్ధబిందు సమప్రాస, పూర్ణబిందు సమప్రాస, ఖండాఖండప్రాస, సంయుతాక్షర ప్రాస, సంయుతాసంయుతప్రాస, రేఫయుత ప్రాస, లఘుద్విత్వప్రాస, వికల్పప్రాస, ఉభయప్రాస, అనునాసికప్రాస, ప్రాసమైత్రి ప్రాస, ప్రాసవైరము, స్వవర్గజప్రాస, ఋప్రాస, లఘుయకారప్రాస, లభేదప్రాస, సంధిగతప్రాస.

చతుర్ధాశ్వాసములో పద్యపరిచ్ఛేదం వివరించాడు కవి. ఇందు గద్య పద్య భేదాలు, షట్ప్రత్యయాలు, ఇరువైఆరు చందాలలో ఉన్న సమవృత్తాల రూపాలు, గౌణ వృత్తాలు, మాలికా వృత్తాలు, చిత్క కవిత్రాలు,గర్భకవిత్వాలు, బంధాలు రూపాలు విపులముగా వివరించాడు. ఇన్ని లెక్కకడితే 13కోట్ల పైచిలువ వృత్తాలవుతాయట. వీటిలో 35 ముఖ్యమైనవి అప్పకవే వివరిస్తాడు.

పంచమాశ్వాసము. ఇది సంధిపరిచ్ఛేదం. ఇందు కళలేవో, ద్రుతప్రకృతాలు అర్ధాలు వివరించాడు. సంధి లక్షణాలు, సంధుల వివరాలతో ఈ పంచమాశ్వాసము ఉంది.

తరువాత మనకు మిగిలిన గ్రంధము దొరకలేదు. అప్పకవి ఇంత వరకే రచించాడో, లేక పూర్తి చేసినా పోయినదో తెలియదు.

మనకున్న లాక్షిణికలలో అప్పకవి అగ్రగణ్యుడు. ఆయన రాసిన ఈ గ్రంథము పూర్తిగా దొరకకపోవటము దురదృష్టము. అప్పకవి శాస్త్రీయ దృక్పథమున్నవాడు. చాలా తెలుగు మాటలకు పుట్టుక, వ్యుత్పత్తి అర్థం సైతం చక్కగా వివరించాడు. ఉదా. ఉయ్యాల, పయ్యెద, తాయెత్తు మొదలైన పదాలకు అర్థము వివరిస్తూ తాయెత్తులు 'ఎత్తు' అనగా దక్షిణదేశమున దండలకు పేరు. ఎత్తును తేలపలికితే యెతు అవుతుంది. తాయి అంటే తల్లి. ఆ తాయి శిశువు రక్షణకు కట్టునది యత్తు కాబట్టి తాయెత్తు అయినది. అప్పకవి భాషాశాస్త్రపరిశోదనా దృష్టితో చూసినాడు. ఆయనకు తమిళము వచ్చి ఉంటుంది. తాయెత్తు ఉర్దూ పదము తావీజు నుంచి వచ్చి ఉంటుదన్న తదనంతరము భాషాశాస్త్రవేత్తలు వివరించినా, అప్పకవి ద్రావిడ భాషా వాదానికి ప్రథమునిగా చెప్పవచ్చు.

అప్పకవి కొన్ని చోట్లు పొరపాటు పడినా, ఆయనను మించిన లాక్షణికులు లేరు. అప్పకవీయము మించిన ప్రామాణిక గ్రంథమూ లేదు. ఆయన చెప్పబట్టే మనకు ఎందరో కవులు, వారి గ్రంథాలు తెలిశాయి.

"ఇది చదివిన పిమ్మట

యెదియేనియు జదువు బుద్ధి యేలా పొడముల్

బదపడి గ్రంథము లన్నియు

వెదకి వెదకి సారమెల్ల వివరింపంగన్" అన్న అప్పకవి మాట సత్యము. పద్యము నుంచి గద్యానికి, అందుండి వాడుక భాషలోకి సాహిత్యము ప్రవహించినా, ఏ విధమైన సాహిత్య ప్రకియకైనా చందస్సు తప్పుదు. అందునా అప్పకవి వంటి వారు భాషను ఎంత శాస్త్రీయముగా చూడాలో కూడా మనకు నేర్పారు.

అప్పకవీయము నేర్చిన వారికి ఎదురేమున్నది? వారు పరిపూర్ణ భాషాశాస్త్రవేత్తలే మరి!!

Ref:

అప్పకవీయం(తృతీయాశ్వాసం) – వ్యాఖ్యాత డా.బులుసు వేంకట సత్యానారాయణమూర్తి

సమగ్ర ఆంధ్ర సాహిత్యం – ఆరుద్ర

ఆంధ్ర కవుల చరిత్రము – కందుకూరి వీరేశలింగం

Comments